# దేవుడి ఉత్తరం

సంక్రాంతి వెళ్ళిన మరుసటిరోజు- నిన్న పెట్టిన రంగు రంగుల ముగ్గులు యింకా చెరిగిపోలేదు. మన దేశానికి ఆయువుపట్లయిన గ్రామాలే పండుగ వేడుకలను బాగా జరుపుకుంటాయి. సంక్రాంతిశోభను ఆంధ్రగ్రామాల్లోనే తనివి తీరాచూడవచ్చు.

ఆదినారాయణగారు వరండాలో వాలుకుర్చీలో పడుకుని భుక్తాయాసం తీర్చుకుంటూనే మధ్యమధ్య ఓ కునుకు తీస్తున్నారు ఆయనదగ్గరలోనే నవ్వారు మంచం చాటున పిల్లలంతాచేరి అన్నాలాట ఆడుతున్నారు.

ఆ ఆటలో ఆదినారాయణగారి పెద్ద కొడుకు కూతురు గాయిత్రి భార్యగానూ, కూతురుకొడుకు. శేషగిరి భర్తగానూ. అచ్చంగా గృహాసీను నిర్వహిస్తున్నట్లే అంతలోనే కోపం.... అంతలోనే విసుగూ. మరి కాస్సేపటికే మెనలేని ప్రేమా. ఒలకబోస్తూ శేషగిరి గాయిత్రి మీద అథారటీ చేస్తుంటే గాయిత్రి "నేనేం తక్కువ?" అన్నట్లు సమవుజ్జీ లాగా బావకి జవాబిస్తోంది. అదే "ఆక్టింగ్ భర్త" అనబడే శేషగిరికి.

"ఇదిగో...మిమల్నే.... ఆ పసి వెధవ అలా కక్కటిల్లుతుంటే చుట్ట కాలుస్తూ కునికిపాట్లు పడకపోతే. కాస్త వుయ్యాల .. ఊపితే ... పాపం వస్తుందా? "సాగదీసుకుంది గాయిత్రి.

"అమ్మగారూ ... గేదెల్ని ఇడిచినా. చద్దిబువ్వెడితే సెరువుకాడ కట్టి కెడతా ... పెయిదూడ లగెత్తుతోంది. బేగిరండమ్మా" బిగ్గరగా అరుస్తున్నాడు ఓ చిన్న కుర్రాడు. "వుండరా వెధవా - చెవుకోసిన నక్కలా అరుస్తున్నావు — మడిగట్టుకు తగులడ్డాను! ఆ బేబీ యెక్కడ చచ్చిందో చూడు. యే డిటెక్టివ్ పుస్తకమో చదువుతూ ఈ ప్రపంచం అన్నం, నీళ్ళు, మరిచిపోతుంది. చూసిరా పో.... తువ్వాలు పమిట పరికిణీలో దోపుకుంటూ వూపిరి సలపకుండా పని చేస్తున్న జానకమ్మలాగా అభినయిస్తోంది. యెనిమిదేళ్ళ గాయిత్రి "ఇదిగో యేమేవ్... నా వుత్తరీయం .... యే గంగలో కలిపారూ .... ఇల్లంతా వెతికినా కన్పించి చావలా. అవతల మీటింగుకు వెళ్లాలి.... నీ మడి తగలబడా .... ఇలా ఇచ్చిపో" గంతులేస్తున్నాడు శేషగిరి. తాతగారి స్వరాన్ని అనుకరిస్తూ.

ఇంతలో సంక్రాంతి గంగిరెద్దు మేళం వాకిట్లోకి వచ్చి "అయ్యగారికీ దణ్ణం పెట్టూ .... డూ .... డూ .... బసవన్నా" అంటూ రాగిఆకుల బూరాలు వూదుతున్నారు ఇద్దరబ్బాయిలు. గంగిరెద్దు ఆదినారాయణగారి రెండో కొడుకు రామం కూతురు అరవింద. చేతులు కింద ఆన్చి నాలుగు కాళ్ళతో నడుస్తుంటే ఆ క్రితం రాత్రి పేరంటం

చేసి వచ్చి విడిచి పడేసిన రకరకాల టెర్లిన్ నైలాన్ చీరెలు వగైరా గంగిరెద్దు వీపుని అలంకరించినాయి. "ఢూ.... ఢూ.... బసవన్నా "అంటూ బూర వూదుతువ్నాడు. బుగ్గలు బూరెల్లాగా పొగించి శ్వాసపడుస్తూ.

ఈ గంగిరెద్దు మేళం శ్రవణానందంగా విన్పిస్తున్నా ఆదినారాయణగారికి నిద్రాభంగం కలగలేదుగాని మనవరాలు గాయిత్రి అచ్చంగా తన భార్య జానకమ్మలాగా ఆక్టింగ్ భర్త శేషగిరిమీద, కారాలు మిరియాలూ నూరుతుంటే గమ్మున మెళుకువ వచ్చి ఇంకా శ్రద్ధగా వింటూ గాయిత్రి "బరాట్ల"కి శేషగిరి భయపడి తన భర్త క్యారెక్టర్ సరిగా నిర్వహించలేక బిత్తరపోయి చూస్తుంటే ఆయన ఇంక ఆగలేక-

"ఒరే శేషూ .... అది ఇలా అరుస్తుంటే చవటలాగా మె .... మె .... అంటావేరా! "నీ మడీ గిడీ అవతల పెట్టు.... ముందు నా వుత్తరీయం ఇలా యివ్వు అని గట్టిగా అడగరా" అంటూ సరీగ్గా కుర్చీలో కూర్చున్నారు. గాయిత్రి చెప్పే జవాబు సరీగ్గా వినాలన్నట్లు.

"అమ్మో... తాతయ్యా... నిదపోటల్లా...."అంటూ మంచం తోసుకుంటూ అందరూ ఒక్కసారి పారిపోబోయి మంచంతో సహా ఆదినారాయణరావుగారి మీదపడ్డారు.

అప్పటివరకూ పనిచేసి అలిసిపోయి పమిట పరచుకొని గడపమీద తలవుంచి నిద్రిస్తున్న జానికమ్మ ఈ సంభాషణ వినీ విననట్లు వింటూ ఆఖరున భర్త మనవడిని వెంటేసుకుని గాయిత్రిమీద అథారిటీ ఆరంభించబోయేసరికి ఆవిడ వళ్ళు

మండి మనవరాలికి తనూ సలహా యిద్దామని "ఎందుకులే... చుట్టూ అల్లుళ్ళూ... కోడళ్ళూ మసలుతున్నారు అప్రతిష్ట" అనుకుని వుద్రేకాన్ని ఆపుకుంటూ వుండగానే "కాగల కార్యం గంధర్వులే తీర్చారు" అన్నట్టు మంచం తిరగబడటం పిల్లలంతా అన్నీ విడిచేసి పారిపోవడంతో "తిక్క వదిలింది... అయ్యగారికి" అనుకుంటూ ఇటునుంచి అటు వత్తిగిలి పడుకుని కళ్ళు మూసింది— కాని.... నిద్రమత్తు కాస్తా యెగిరిచక్కాబోయింది.

పిల్లలందరూ నట్టింట్లో నాలుగురోజులు పచ్చపచ్చగా తిరుగుతోంటే చూచుకోవాలని జానకమ్మ కలలుగంటూ భర్తనిపోరి... అందరికీ వుత్తరాలు రాయించగా రాయించగా ఒకరికి వీలుంటే ఒకరికి వీలుగాదంటూ యెలాగైతేనేం ఆదినారాయణరావుగారి ముగ్గురు కొడుకులూ, నలుగురు కూతుళ్ళూ సంక్రాంతికి వచ్చి నట్టింట నాలుగు రోజులు కుటుంబాలతో సహా వున్నారు. తమ సంతానాన్ని తనివితీరా చూసుకుని మురిసిపోయారు ఆ భార్యాభర్తలిద్దరూ. అందరిలోకీ ఆఖరుది సరోజ. పెళ్ళి జరిగి నాలుగు సంవత్సరాలైనా యెప్పటికీ నూతన వధువులాగా పడకగదిలోంచి కాలుబయట పెట్టదు. భర్త భాస్కరంతో ఒకటే కబుర్లు.

పండుగ వెళ్ళిన మూడోరోజు అందరూ వెళ్ళిపోయారు. ఇల్లంతా చిన్నబోతుంటే బిక్కుబిక్కుమంటూ భార్యాభర్తలిద్దరూ కాస్త యెంగిలిపడీ వాకిట్లో కూర్చున్నారు. ఎవరి ఆలోచనల్లో వాళ్ళు కొట్టుమిట్టాడుతూండగానే సంధ్య దీపాలు వెలిగించారు.

ఆదినారాయణ రావుగారికి వుద్యోగం చెయ్యవలసిన అవుసరం అంతలేదు. పిత్రార్జితం పాతికెకరాల సుక్షేత్రమైన మాగాణి పొలంస్వంతంగా చేసుకుంటూహాయిగా పూర్వులు కట్టించిన ఇంట్లోనే పిల్లలందరినీ పెంచిపెద్దచేసి. అవుసరంఅయినపుడల్లా కాస్త కాస్త పొలం అమ్మగా ఆఖరికి సరోజ పెళ్ళి పూర్తి అయ్యేసరికి మూడెకరాల్లోకి వచ్చింది. ఇంక శేష జీవితం 'కృష్ణా రామా' అనుకుంటూ ఆ యింట్లోనే గడపటానికి నిశ్చయించుకున్నారు భార్యాభర్తలిద్దరూ. పండగ వచ్చినప్పుడు పెద్దకొడుకు అన్నాడు తండ్రితో "పెద్దవాళ్ళయి ఇక్కడ ఒంటరిగా ఎందుకునాన్నా నా దగ్గరికి వచ్చేయండి" అని.

పెద్దకోడలు డాబు. దర్జాలకే ఆ గెజిటెడ్ ఆఫీసర్ జీతం చాలక యిబ్బంది పడడం ఆ తల్లిదండ్రులు యెరుగును.

ఇంతలో రెండో కొడుకు సూర్యం అందుకున్నాడు. "నీ వొక్కడిదగ్గరే ఎందుకన్నయ్యా... పొలం కవులుకిచ్చేసి ఆరునెలలు నీదగ్గర.... ఆరునెలలు నా దగ్గర వుంటారు" అంటూ. అన్నగారి బాధ్యత సగం తగ్గిస్తూ వదినగారి మెప్పు కోసం ఆమెపైపు చూశాడు. అయినా కామేశ్వరి ప్రసన్న సూచకంగా ఒక్క చిరునవ్వునా పారేయలేదు. హతాసుడైనాడు రామం.

ఇదంతా చూస్తుంటే వాసుకి వళ్ళుమండిపోయింది అన్నగార్ల స్వభావాలకి. "అమ్మా... నాన్నగారూ నాదగ్గరే వుంటారు .. మీకెవరికన్నా యెవ్వరైనా చూడాలనిపిస్తే వచ్చి నిరభ్యంతరంగా చూడవచ్చు"

"నువ్వు మా అందరికంటే ఎంతపెద్ద ఆఫీసరివైనా ఇద్దరినీ భరించగల ధీమా వున్నా… ఆ దేశంగాని దేశంలో తెలుగుమాటకేకరువు పడీ యేం వుండగలరు?... వాళ్ళకి కాస్త కాలక్షేపం కావాలా" ఆగిపోయింది చిన్నకోడలు.

ఇంక ఆ విషయం పెంచటానికి ఇష్టంలేనట్లు ఆదినారాయణరావుగారు నిర్మోహమాటంగా అనేశారు. అరేయ్ అబ్బాయిలూ .. మేమిద్దరం.... ఈ ఇల్లువిడిచి... ఇప్పట్లో యెక్కడికీ రావటం జరగదు. మమ్మల్ని చూడాలనిపించి నప్పుడల్లా ఇలాగే వచ్చి వెడుతూ వుండండి. ఈ ఇల్లూ వాకిలీ వదిలి... మీఅమ్మ యెక్కడికి రాదుట." అనటంతో ఇంక అప్పటికి ఆ ప్రస్తావన ఆగిపోయింది. తల్లిదండ్రులని వదలలేక బాధగానే వెళ్ళిపోయారు పిల్లలందరూ.

మాటిమాటికీ తిరుగుతున్న కళ్ళనీళ్ళని పమిటతో వత్తుకుంటూ దుఃఖాన్ని దిగమింగుకుంటూంది జానకమ్మ. ఇంతలో అక్కయ్యా అన్నపిలుపుకి జానకమ్మకి ప్రాణం లేచి వచ్చినట్టుంది. కలకాదుగదా అనుకుంటూ కళ్ళు నులుముకుని చూసింది. ఎదురుగా హిడింబాయమ్మ ప్రయాణపుబడలికతో "హుస్సు" అంటూ గడపలో కూలబడింది.

"చెల్లాయ్— నువ్వే—" జానకమ్మ అమాంతం కావలించుకుంది హిడింబాయమ్మని.

"యాత్ర పూర్తిచేసుకు వచ్చావా చెల్లాయ్— ఎంత అదృష్టవంతురాలివే— మరిదియేడీ" అంటూ చుట్టూ చూసింది. హిడింబాయమ్మ కళ్ళుతుడుచుకుంటూ.... అక్కా యాత్ర పూర్తి అయి ఇంటిముఖంపట్టి వస్తుండగా రెండు

రోజుల క్రితం నుంచీ ఆయనకి జ్వరం వస్తుందమ్మా, ఆయన్ని గడపల్లో వుంచి తాళం చెవికోసం వచ్చా అంటుంటే.... జానకమ్మ గూట్లోంచి తాళం చెవి తెచ్చి స్నేహితురాలి కిస్తూ-

"చెల్లాయ్... ఆరునెలలు ఆరు సంవత్సరాలుగా గడిచాయంటే నమ్ము. అబ్బ— వంటరి తనంతో బలేబాధ పడ్డానంటే— అమ్మయ్య... నువ్వు వచ్చావు. రోజూ దేవుడిని ప్రార్థించేదాన్ని. నా చెల్లాయియా, మరిదీ క్షేమంగా తిరిగి ఇంటికి వచ్చి నట్టింట్లో నాలుగు వారాలపాటు పచ్చగా సంసారం చెయ్యాలి. భగవంతుడా అని' ఇంకా చెప్పాకు పోతూనే వుంది జానకమ్మ. కాని ఆదినారాయణరావు గారు "ఆ విషయాలన్నీ తర్వాత, ముందు ఆజ్వరంమనిషికి యేం కావాలో... ఆవిడ... యెప్పుడు భోంచేసిందో... కాస్త వాళ్ళకి యేం కావాలో ముందుచూసి ఆ తర్వాతతీరుబడిగా స్నేహితులిద్దరూ"

"అయ్యో నా మతిమండిపోనూ— కాసిని మంచి నీళ్ళయినా అడక్కుండా యేమేమో వాగేస్తున్నా... ఇదిగో చెల్లాయ్ .... ఆ సామాను లోపల గిరాటేసి .... ఇద్దరూ రండి .... కాస్త స్నానంచేసి యెంగిలి పడుదురుగాని ... సరేనా" అంటూ స్నేహితురాలిని పంపి ఇంట్లోకి వెళ్ళి పొయ్యి వెలిగించింది.

జానకమ్మలో అంతవరకూ వున్న "స్తబ్దత" యెగిరి చక్కా పోయింది ప్రాణస్నేహితురాల్ని చూసేసరికి.

హిడింబాయమ్మా వెంకట్రామయ్యగారూ వుద్యోగ రీత్యా వూరికి యెప్పుడు వచ్చారో ఆ వూరిప్రజలూ మరిచి పోయారు. ఆ దంపతులూ మరిచిపోయారు. ఎందుకంటే ఆయన సర్వీసంతా ఆ వూరిలోనే. మరి అయితే ఒక్క సంగతి.

ఆయన ఆవూరికి వచ్చిన కొత్తలో ఆవూరి కుర్రకారు ఆయనకీ ఓ "బిరుదు" ప్రధానం చేశారు "అద్దాలబండి" అని. అదే అక్షయంగామారి ఆయన తల్లి దండ్రులు "బార సాల" రోజున వేదోక్తంగా వెండిపళ్ళెంలో బంగారు వుంగ రంతో రాశిన వెంకట్రామయ్య అనే పేరు మరుగున పడి పోయింది.

అందరూ ఆయన ఎదురుగా "మాష్టారూ" అని చాటున "అద్దాల బండీ" అనీ పిలవటం ఆయనకీ తెలుసు. లోపల లోపల వుడికిలి .... అలా అన్న స్కూలు పిల్లలని చావబాది ... ఆ పైన అతనూ ఆవూరి ప్రెసిడెంట్ వరకూ వెళ్ళీ నానా గందరగోళంచేసి విడిచింది ఆ సమస్య. ఇంక అంతటితో వూరు కున్నాడు. ఆయన విడవకుండా కళ్ళజోడు ధరించడమే ... ఆ బిరుదు ప్రధానానికి కారణం. ఇంక హిడింబాయమ్మ నల్లగా గుండ్రంగా వుంటుంది. మాటకాస్త తొందరే అయినా వెన్నలాంటి మనస్సు. మాష్టారు .... బయట అందరికీ మంచివాడేఅని పేరు తెచ్చుకున్నా హిడిం బాయమ్మకి మాత్రం "నల్లరాయి" పాషాణంలాంటి మనిషి అని సాధిస్తూనే వుంటుంది భర్తని.

పిల్లలు లేకున్నా ఒక్క క్షణం పడదు ఆ భార్యా

భర్తలకి. కారుమేఘాలు కమ్ముకుని దబదబా కుంభవృష్టిగా వర్షం పడి అంతలోనే ప్రశాంతంగా మారి ... తెరిపి ఇచ్చి నట్లు వుంటుంది వారి ఇద్దరి కలహం కూడా. వెంకటరామయ్య మాష్టారికి జాతకాలపిచ్చి బోలెడంత. కన్పించిన ప్రతికోయ వాడికీ తృణమో ఫణమో, ముట్టజెప్పి ... చెయ్యి చూపించుకుని కలిసివస్తుందన్న కాలం కోసం కలలుకంటూ, అదే రోజులు లెఖిస్తూ. ఆశతో యెదురుచూస్తూనే వుంటారు. ఆయన కోయివాడు చెప్పినట్లు ప్రమోషన్ వచ్చి తను హెడ్ మాష్టర్ల సమస్కారాలు అందుకుంటూన్నట్లు కలలు కనటమే మిగిలిపోతోంది.

ఆరు నెల్లక్రితం మాష్టారు స్కూలు నుంచి ఇంటికి వస్తుంటే ఒక కోయతార ఆయన ముఖాన్నే పరీక్షగా చూసి మందహాసం చేస్తూ ... సమయం యెక్కువ లేదు ... హాయిగా యాత్రలన్నీ పూర్తి చేసి ఆఖరికి భద్రాచల రాముడి దగ్గరికి రా .... దొరా ... అక్కడ నేను నిన్ను తప్పకుండా కలుస్తా .... జీవితాలు అశాశ్వతాలు .... దీపం వుండగానే చక్క బెట్టుకో ...." అంటూ తేదీతో సహా చెప్పి వెళ్ళిపోయాడు.

మాష్టారి తల తిరిగిపోయింది. తనకి...ఆరు నెలలకంటే వ్యవధిలేదూ? ఇది నిజమా? ఆ కోయవాడి ముఖంలో ఏదో తేజస్సు వెలిగిపోతోంది. మాటే .... అంత స్వాయంగా మాట్లాడ గలిగాడు? యేమిటిదంతా .... ఆయన కళ్ళు తిరుగున్నా ఎలాగో అలాగ ఇల్లు చేరేడు, తల అంతా ఏవో అర్థం పర్థం లేని ఆలోచనలలో.

ఆరు నెలల భాగ్యానికి ఎందుకు ఇంత తాపత్రయం. చాలీ చాలని జీతంలో కూడా ముందు చూపులో .... "ఇన్నూరెన్నూ" వల్లకాదు ... ఎందుకివన్నీ .... ఎవ్వరో తిని సుఖపడేందుకు .... తను ఎందుకింత కష్టపడటం .... గొంతు చించుకుని .... కాస్తయినా విశ్రాంతి లేకుండా ఇన్ని ప్రవేట్లు ఎందుకు... ?" స్కూల్లో పిల్లలకి సరిగ్గా చెప్పకుండా ఆ పిల్లల తల్లిదండ్రుల రక్తం వోడ్చిన ఆడబ్బు తన కెందుకు? మాష్టారిలో ఆత్మ విమర్శ యెక్కువై పోయింది. ఛీ .... వెధవ జీవితం .... బ్రతికిన నాలుగురోజులూ నిజాయి తీగా బ్రతకాలి .... ఇలా ఎన్ని ఆలోచిస్తున్నా ఆయనకి మాత్రం డిశంబరు ఇరవై ఎనిమిది తారీఖుమీదే వుండేది దృష్టి .... ఇంక స్కూల్లోని పిల్లలకి పాఠాలు చెప్పటంలో శ్రద్ధ తీసుకున్నాడు. అప్పటివరకూ మాటి మాటికీ తగూ దిగే ఆయన స్వభావం కాస్త కాస్త మారజొచ్చింది. హిడింబాయమ్మ బోలెడంత ఆశ్చర్యపడింది ఈ మార్పుకి. ఆయన మాత్రం ఈ విషయం భార్యకి తెలియ నీయలేదు. భర్తలోని ఈ మార్పు ఆవిడకి నచ్చటంలేదు. ఆవిడకి తోచటం లేదు కూడా. అవును మరి చీటికి మాటికీ ఇద్దరూ మాటకి మాట అనుకుంటూంటే బోలెడంత కాలక్షేపం ఆవిడకి.

జానకమ్మ హిడింబాయమ్మా ప్రాణస్నేహితులే అయినా అక్కా .... చెల్లీ అనుకుంటూ అన్యోన్యంగా వుండే వారు. యేకాస్త కష్టంగాని సుఖంగాని, జానకమ్మ దగ్గర వెళ్ళబోసుకుంటే గాని హిడింబాయమ్మ ఒక్క క్షణం

వుండలేకపోయేది తీర్థయాత్రల కంటూ వెళ్ళి ఆరు నెలలు కనపడిన దేముడినల్లా "నా పసుపు కుంకుమ నిలుపుస్వామీ" అంటూ కంటికీ మంటికీ యేకధారగా ఏడిచింది. మాష్టారు ఎంత జాగ్రత్త పడ్డా ఈ యాత్రలకి అసలు మూలకారణం పసికట్టేసింది ఆవిడ.

దక్షిణదేశ యాత్రల్లో ఆ దంపతుల నిద్దరినీ మరీ కదలించేసింది మధుర మీనాక్షి. దేవాలయ ప్రాంగణం దాటి మీనాక్షిని దర్శిస్తుంటే ఆ యిద్దరి మనస్సులూ అనంతపారవశ్యంతో గంతులేసినట్లయింది. మాష్టారు లక్ష్మీస్తోత్రం మృదుమధురంగా గానం చేస్తుంటే .... హిడింబాయమ్మ రెండు చేతులూ గుండెల దగ్గర పెట్టుకుని నమస్కరిస్తూ ఒక్క క్షణం తననితను మరిచి యే లోకాల్లోకో తేలిపోయింది. విచిత్రం అక్కడా ఆమెకి భర్తగొంతు విన్పిస్తూనే వుంది. జీవితంలో మొట్ట మొదటిసారి ... గర్వపడింది ఆయన భార్య అయినందుకు. రామేశ్వరం, కన్యాకుమారీ, వెళ్ళి... తిరిగి వెనక్కి వచ్చి గోకర్ణక్షేత్రం దర్శించి ... అరేబియా సముద్రంలో స్నానం చేసి .... హుబ్లీ మీదుగా కొల్హాపూర్ నుంచి పండరీపూర్ వెళ్ళి ... పాండురంగడిని దర్శించటానికి "స్వర్ణముఖి" లో స్నానం చేసి రంగడి దగ్గర జ్వరపడింది హిడింబాయమ్మ.

మాష్టరుగారు భయపడ్డారు. కోయవారు చెప్పింది తల్లకిందులు కాదుకదా? అని కాస్సేపు ఆయన గుండెలు గబగబా కొట్టుకున్నాయి. మనస్సులు కలవక పోయినా ఏదో "అదృశ్య శక్తి" ఆ భార్యా భర్తల నిద్దరిని బంధించి

వుంచింది. యాత్రలుచేస్తున్నా జానకమ్మకి వుత్తరాలు రాస్తూ తమక్షేమం తెలియ జేస్తూనే వున్నారు. ప్రయాగ, హరిద్వార్, వెళ్ళి తర్వాత ఇంక జానకమ్మకి వుత్తరాలు రాయకపోవడంతో స్నేహితురాలి క్షేమంకోసం అల్లాడి పోయేది. ఆదినారాయణగారు మాత్రం 'నిమ్మకెత్తిన నీరు లాగా" వూ ... ఆ ... అనకుండా పొలం పనులకిపోగా మిగిలిన సమయం, పేకాటలో దొర్లిస్తూ హాయిగా కాలక్షేపం చేసేవారు.

జానకమ్మ ఆవేదన ఆయనకి యే విషయంలోనూ అక్కర్లేదు. పిల్లలంతా వున్నప్పుడైతే ఇలాంటివన్నీ ఆలోచించేందుకు ఆమెకి తీరికచిక్కేదికాదు. పెద్దకొడుకు సెక్రటేరియట్‌లో అసిస్టెంట్.

రెండోవాడు రామం లాయరు ... మూడోవాడు శేషు ... I. A. S. ఆఫీసర్ మైసూర్ స్టేట్‌లో. ఇంక కూతుళ్ల ముగ్గురి సంసారాలకీ యేమంత లోటులేదు...

ఆఖరిపిల్ల కావడంవల్ల జానకమ్మ ప్రాణం సరోజ మీదే వుంటుంది. ఆరు నెలలకోసారి చూస్తేగాని.... లేకుంటే ముందు తనే బెంగ పెట్టుకుంటుంది.

ఈ మమకారం ... తనవొక్కర్తికే .... ఆదినారాయణగారిలో వెదికి చూసినా దిగులుగానీ బాధగానీ కన్పించదు. "అయ్యో పిల్లలని చూసి చాలా రోజులైంది" అనే మాట ఆయన నోట్లోంచి వస్తుందేమో అని .... ముప్ఫయి సంవత్సరాల దాంపత్య జీవితంలో ప్రతిక్షణం యెదురు చూసింది .... అబ్బే .... తను చూడాలంటే

మాత్రం వుత్తరం రాసి పిలిపించో లేకుంటే తనుకాని పంపిస్తాడు. పిచ్చిగాని .... ఈ ఇల్లూ వాకిలీ వదిలి .... ఆ పట్నవాసాల్లో యెన్ని రోజులు వుండగలదు తను?

ఒకసారి సరోజ కొత్త కాపరం చూసేందుకు వెళ్ళి ఒక వారం రోజులు వుంది. అల్లుడు భాస్కరం కూతుర్ని యెంత అపురూపంగా చూసుకుంటాడో అర్థం చేసుకుని సంతృప్తిగా నిట్టూర్చింది. ఈ కాలం వాళ్ళే అదృష్టవంతులు. ఒకర్ని ఒకరు అర్థంచేసుకుని హాయిగా జీవిస్తున్నారు. వాతావరణమూ అందుకు వీలుగా వుంది. చాలీచాలని జీతం అయినా, మనసూ మనసూ, యేకమై పాలలో నీళ్ళలాగా యేకం కాగలుగు తున్నారు. తనలాంటి వాళ్ళకో?

జానకమ్మ పుట్టింటికి వెళ్ళి నాలుగు నెలల తర్వాత వచ్చినా "జానీ .... అబ్బ ... వంటరిగా వుండలేక పోయానంటె నమ్ము" అని ఆయన అంటాడేమో అని యెదురు చూసేది. అబ్బే .... నిష్ఫల మైన ఆలోచనలే మిగిలేవి. ఆదినారాయణగారు అవన్ని యేమీ అనక తన అవుసరం గడుపుకుని "అబ్బ .... లోపల ... వుక్క గావుంది "అంటూ ఆరుబయట నవారు మంచం మీద మేనువాల్చి అంతలోనే "గుర్రు" పెట్టి హాయిగా నిద్రపోయేవారు. జానకమ్మ వుడికి పోయి ఆవేశపడి చివరికి ఇదంతా దుఃఖంగా మారి ఆ రాత్రి అంతా జాగారం చేసి మరునటిరోజు ఎంతో భారంగా గడిపినా ఆయనకి చీమకుట్టినట్లయినా వుండేది కాదు. తర్వాత తర్వాత ఈ జీవితమే అలవాటు చేసుకుంది. అయినా అప్పుడప్పుడు ఈ అలవాటు తప్పడం లేదు.

హిడింబాయమ్మకి భోజనం పెట్టి మాష్టారికి కాఫీ ఇచ్చి ఇల్లు సర్దుకుని వచ్చి ఆదినారాయణగారి మంచం పక్కనే వున్న తన మంచం మీద దిండు సరిచేసుకుని ఆవలిస్తూ "నిద్రపట్టిందా?" అన్నది భర్తని వుద్దేశించి.

"ఉ .... హూ ...." అంటూ మూలిగి పక్కకి వత్తిగిలి దుప్పటి ముసుగు పైకి లాక్కున్నారు ఆయన.

"యేమిటోగా వుంది .... కాస్సేపు కబుర్లు చెప్తే కొంప మునిగిపోదు .... దుప్పటి లాగబోయింది.

"వూ" అంటూ గట్టిగా ముసుగు తన్ని పడుకున్నాడు.

జానకమ్మ మనస్సు దెబ్బతినేది ఇలాంటప్పుడే.

ఛీ వెధవ బ్రతుకు ... ఓ ఆప్యాయతా .... ఆదరణా? దేనికీ నోచుకోలేదు మొండిగా బ్రతకటం తప్ప. కళ్ళనీళ్ళు గిర్రున తిరిగాయి ఆవిడకి. కొడుకులని చూసి సిగ్గుపడాలి. వాళ్ళు భార్యలతో యెంత హాయిగా, నవ్వుతూ .... వుంటారో ... చూస్తుంటే ... తనకి యెంతో ముచ్చట వేస్తుంది. నల్లరాయిలాంటి ఈ తండ్రి ప్రకృతి మాత్రం పిల్లలెవ్వరికీ రాలేదు. కాని మూడో కూతురు సావిత్రికి మాత్రం వచ్చింది. అచ్చంగా తండ్రి నోట్లోంచి వూడిపడింది "వూరుమీద వూరుపడ్డా కరణంమీద కాసుపడదు" అన్నట్లు వులకదు .... పలకదు. ఆ ప్రకృతిని మార్చాలని చిన్నప్పటి నించీ తను విశ్వప్రయత్నం చేసింది. అబ్బే ... యే కాస్త కూడా ప్రయోజనం కలగక ఇంక "నీ ఖర్మ" అని వదిలేసి వూరుకుంది.

అల్లుడు చాకులాంటివాడు గనుక ఆ నల్లరాయిని

లొంగదీసుకుని దారిలోకి తెచ్చి సంసారం చేస్తున్నాడు. యేమిటో ఈ భార్యాభర్తల సంబంధం? ప్రపంచంలో అభిప్రాయభేదాలు లేకుండా ఎంతమంది అన్యోన్యంగా కాపురం చేస్తున్నారు? వెదికిచూస్తే మచ్చుకి ... కొన్ని మాత్రమే .... దొరుకుతాయేమో? అయితే ఒక్కటి మాత్రమే .... నిజం. మన హిందూ వివాహ సాంప్రదాయంలో యేదో అజ్ఞాత శక్తి దంపతుల నిద్దరినీ కట్టి పడేస్తుంది.

హిడింబాయమ్మ అహర్నిశలూ భర్తకి సేవచేసి అన్నం నీళ్ళు కూడా మరిచి .... యెలాగైతేనేం .... భర్తని దక్కించుకుంది. మాష్టారుగారు తిరిగి కోలుకొంటున్నారు.

యెంతో బలహీనంగా వున్నా నెమ్మదిగా స్కూలుకు వెళ్ళి యెంతో శ్రద్ధగా పిల్లలకి పాఠాలు చెప్తుంటే తోటి ఉపాధ్యాయులు ఆశ్చర్యంగా చూస్తూ-

"బాత్తిగా మారిపోయారు మాష్టారూ!" అంటూండే వాళ్ళు. ఆయన కళ్ళద్దాలని సరిచేసుకుంటూ గంభీరంగా నవ్వి "యేమిటోనండి... పునర్జన్మ. యెత్తానేమో అన్పిస్తుంది. అయినా ఆ దేవదేవుడి... దృష్టిలో మనం యెంతటివాళ్ళం" అంటూ తను చేసిన యాత్రల గురించీ, అక్కడక్కడి ప్రజల ఆచార వ్యవహారాల గురించీ గంటల తరబడి ఆయన అనర్గళంగా చెప్పుకుపోతుంటే శ్రోతలు యెంతో శ్రద్ధగా వింటూ వుండిపోయేవారు.

"గంగలో స్నానంచేసి విశ్వేశ్వరుణ్ణి దర్శించిన మనస్సు తిరిగి ఇంటికి రానని మొరాయించింది. అబ్బ... హృషీకేస్ లోనూ అంతే. నాకన్నింటికంటే ... బదరీయాత్ర... మహా నచ్చింది ... ఆ అమరనాథుని దర్శించని కన్నులు... కన్న లేనా.... మంచుపిండిన.... ఆ కొండలు - ఓహ్.... మాటలు చాలవు ఆ ప్రకృతి దృశ్యాన్ని వర్ణించలేను. కాని ఆ యాత్రకి కేవలం డబ్బే కాదు. శరీరంలో శక్తి కూడా కావాలి మానవుడిలో అజ్ఞాతంగా వుండే 'అహం' ఆ యాత్రలో ఒక్కొక్క పిసరే కరిగి కరిగి చివరికి ఆ 'అలక నందా' నదిలో కలసిపోతుందా? అన్పిస్తుంది. మనం వైజ్ఞానికంగా యెంత అభివృద్ధి సాధించినా మానవుడు చంద్ర మండలం మీద కాలుమోపినా ఈ విశ్వాంతరాళంలో యింకెన్ని రహస్యాలు దాగి వున్నాయో?

"నిజం... నిజం" తల వూపేవాళ్ళ శ్రోతలు. ఇదంతా వింటున్న హెడ్మాష్టరు భజగోవిందంగారికిమాత్రం వళ్ళంతా కారం రాచినట్లుగా వుండేది. లోపలలోపలే అనుకునేవాడు ఆయన "అవునవును. చచ్చిపోతాననేభయంతో సున్నపాకు తొడిమెకూడా మిగల్చకుండా దొమ్మరి వెధవలాగా తిరిగి పెళ్ళాం మెళ్ళో తెలపూసలోకి నల్లపూస లేకుండా చేసి యేబ్రాసిమొఖంతో మళ్ళీ ఈ వూరే చేరి మెట్టవేదాంతం దంచుతున్నాడు. మెట్టవేదాంతం" అనుకుంటూ తనలోతనే సంతృప్తిపడి "ఇంక యేం తింటాడో చూస్తాగా! ఇంట్లో ఇబ్బందిగావుంది. మాష్టారూ నాలుగు రూపాయలు సర్ద మని రాకపోతాడా, అప్పుడు నాలుగూ అడిగెయ్యాలి." అని అలాంటి అవకాశం త్వరగా రావాలని కోరుకుంటూ కాచుకు

కూర్చున్నాడు భజగోవిందం మాష్టారు, తనలో పొంగే అసూయని లోలోపలే నొక్కిపెట్టేస్తూ.

చివరికి పాత్ర సామాను కూడా అమ్మేస్తుంటే... భార్య గోలపెడితే "అయ్యో... వద్దంటే విన్నాడూ తిక్క పంతులు. నే వచ్చింతర్వాత ఇదంతా... ఇంకోరు అనుభవించటమేగా! అంటూ అయ్యవారి నట్టిల్లుగా మార్చాడు. అనుకుంటూ చెవులు కొరుక్కుని యెదురుగా మాత్రం— "యేం శాశ్వతం మాష్టారూ — ఇవాళ చస్తే రేపటికి రెండు. మేం చూడరాదూ... కూపస్త మండూకాల్లాగా కొట్టుకుంటున్నాం... దేశం నాలుగు మూలలా చూడాలనివున్నా సాగి చస్తేనా ? యేమిటో... ఈ కాస్త 'పిట్టా' యెగిరిపోయేవరకూ ఈ భార్యా పిల్లలూ అంటూ వ్యామోహపడతాం. ఆ తర్వాత యెవరికి యెవరో ! మీరు నిజంగా అదృష్టవంతులు... యేరూ పేరా కాని ఆ కాశీ విశ్వేశ్వరుడిని దర్శించి జన్మ ధన్యం చేసుకున్నారు. ఆ అదృష్టం తమకి లేదుగదా" అని నిట్టూర్చే వారు మరికొందరు. ఇంతలో.

"బండీ పంతులుగారూ... దేవుడిని చూసొచ్చారంటగా" అంటూ నెత్తికి చుట్టుకున్న చిరిగిన తువ్వాలా ముక్క తీసి క్రింద దులుపుకుని... ముడుచుకుని కూర్చుంటూ "చెప్పండి దొరా. అన్నాడు చెలపాయ్.

"నీకెవరు చెప్పార్రా" మందహాసంలో అడిగారు మాష్టారు. "యెవరేంటి ... మీ బడిపిల్లకాయలే" 'అద్దాల బండీ కాళ్ళట్టుకో, నేరుగా సరగానికి తీసుకెడతాడు' అని

"బాబ్బాబు ... ఈ సారి నన్నేం బెట్లు కెల్లకూ! అస్సలు నాకేం గుర్తు మిా రెడతారని? లేకుంటే అప్పట్న వచ్చుండే వాడిని గందా! పంతులుగారూ, దేవుడు మాయాబజారు సిమ్మాలో రామారావులాగుంటాడంటగా! రామారావు నరగంలో దేవుడిని చూసొచ్చే అట్టా యాసంకట్టాడంటగందా! ఏంటో రామారావుకి తలకాయ లేదుగందా? యెట్టాగో నరగం వెళ్ళినాడు, ఆ దేవుడ్నె లాక్కొచ్చి యాసం కట్టించుంటే పోలా. బలే పసందుగుండేది కదా. బండి పంతులుగారూ మొన్న ఏవయిందంటే, రెడ్డిగారింటి పెళ్ళికి వూరి బావిసిళ్ళు మోసినాగందా. కాపిడేసినందుక్కాదూ. ఈ బుజం పెచ్చురేగి యెంత పెద్ద "వుండడిందో? చూడండి" అంటూ చిరిగిన చొక్కా తొలగించి ఆ గాయాన్ని చూపిస్తుంటే మాష్టారి జాలిగుండె కదిలిపోయింది. అమాయకుడిని తమ స్వార్థానికి యెంత వుపయోగించుకుంటున్నారో! ఆలోచిస్తూ న్నారు ఆయన.

చెలపాయ్ అంతలోనే ఆ విషయం వదిలి తన ధోరణి మొదలు పెట్టాడు. "దొరా, రెండు రూపాయలిచ్చారుగా రెడ్డిగోరు! దాంటో ఓ రూపాయట్టుకెళ్ళి ఆ పోష్టు మనిసిని ఓ వుత్తరంముక్క ఇయ్యి అన్నా.

నీకు లేదంటాడు. మిగతా అందరికేమో దమ్మిడీ దండగలేకుండావుత్తరాలిత్తాడు,నాయాల. డబ్బిచ్చి ఓముక్క ఇట్టా పారేయ్ అంటేకూడా యెధవ నీలుగుతున్నాడు. నాకు తెలవకడుగుతా పంతులుగారూ! ఆడి దగ్గర అన్ని కట్టలు కట్టలు వుంటాయి గందా, ఓ చిన్న ముక్కిస్తే ఏం?" నేనేం దేబిరిగొట్టులాగా వూరికే అడిగానా? మీరే చెప్పండి.

మాష్టారికి వాడి అమాయకత్వానికి జాలేసింది.

"చెలపాయ్. పోస్టుమేన్ నీ కెవరన్నా రాస్తే ఇస్తాడు గానీ లేకుంటే ఇంకొకరి వుత్తరం నీకిస్తే వాడి వుద్యోగం వూడుతుంది. నువ్వు యెవరికన్నా రాస్తే, వాళ్ళు తిరిగి నీకు రాస్తె అది నీ కిస్తాడు. అదీ సంగతి" విడమర్చి చెలపాయ్‌కి అర్థమయ్యేట్లు చెప్పానని ఆయిన సంతోషించబోయారు. చెలపాయ్ ఒక్క క్షణం, సీరియస్‌గా ఆలోచించాడు. "పంతులుగారూ. నా కెవ్వరూ లేరుగందా యెవరు రాత్తారు? పోని మీరన్నట్లు నేనే రాత్తాను. అప్పుడు నాకు ఓ వుత్తరం ముక్కొస్తుందా? ఈ దొంగనాయాల నాకిత్తాడా చెప్పండి" ప్రాథేయపూర్వకంగా అడిగాడు చెలపాయ్ మాష్టారి కళ్ళ ల్లోకి చూస్తూ.

నీకే వుత్తరం వస్తె నువ్వెక్కడున్నా తీసుకొచ్చి యిస్తాడు- గాని, మరి నీ కెవ్వరూ లేరన్నావుగా. మరి యెవరికి రాస్తావ్?" ఆసక్తిగా అడిగారు ఆయన.

"యేంటి దొరా. మీకీమాత్రం తెల్దూ! యెవ్వరు లేకపోయినా భగవంతుడున్నాడు గందా ఆయనగారికే రాస్తే యేం తప్పా? మనలోమాట పంతులుగారూ, భగవంతుడు మరి జవాబు రాత్తాడంటారా?"

మాష్టరిగారికి ... ఒక్క క్షణం కాశీవిశ్వనాథుడు కళ్ళల్లో మెదిలాడు. చెలపాయ్ ... ఎంత అమాయకుడైనా తనలాంటివారికి ఎవరు లేకున్నా భగవంతుడున్నాడనే నమ్మకం అతని గుండెల నిండుగా వుంది. ఈ విషయం అర్థంచేసుకున్న

మాష్టారు అమాయకుడైన చెలపాయ్ ముందు ఒక్కక్షణం మ్రాన్పడిపోయారు అతని నమ్మకానికి ఒకవిధంగా సంతోషించారుకూడా.

"యేంటి పంతులుగారూ .... నే చెప్పేదినండీ. పొట్టి మనిషి వుత్తరం ఇయ్యకుండానే వూరుకున్నానా. ఆ రెండ్రూపాయల్తో ఆ మిషనుకుట్టు బుడాసాయిబుతో రెండుత్తరాలు రాయించి నే నే తీసికెళ్ళి ఆ డబ్బాలో యేశా. ఇదిగో చూడు మాష్టరూ, ఈ కాలంలో యే యెదవనీ నమ్మేట్టుగాలేదు. అయినా .... ఒక్కొత్తరానికీ జవాబు రావటంలా. ఏందో మోసం జరగుతోందండీ, తెలిసి చావటంలా. లేకుంటే ఇయ్యాలో రేపో వస్తుందో! మరే పంతులుగారూ, రామారావుకేమో ఇట్టా చెప్పి రాయించా. సరిగ్గా వినండీ... 'రామారావుగారు' దేవుడిని మావూరు రమ్మని నే వుత్తరం రాశా....మరి ఆయనకి మా వూరికి దారి తెల్వదు గందా! అందుకని .... నువ్వు విమానం పట్టుకెళ్ళి నువ్వు వెంటెట్టుకుని నేరుగా నా దగ్గరికి లాక్కురా. నువు ఈ వూరొచ్చి, పిచ్చి చెలపాయ్ ఎక్కడున్నాడంటే రోడ్డుమీద గజ్జికుక్క కూడా నా దగ్గరికి లగెత్తుకుంటూ తీసుకొస్తది .... లేకుంటేనా? నా తడాకా దానికి తెలుసులే. మరి ... నేను తినేది అన్నం .... గిన్నం, మిగిలిసి ... దానికెట్టేది మరెందుకు? అవసరంవత్తే ఈపాటి సాయంలేకపోతే? మీరే చెప్పండి.... బండిపంతులుగారు."

పిచ్చి చెలపాయ్ .... ధోరణి ఇలా సాగిపోతూనేవుంది. ఈ పిచ్చిచెలపాయ్ యెక్కడివాడో యెవ్వరికీ తెలియదు.

వాడినే అడిగితే .... హి హి హి ... అంటూ నవ్వుతూ "ఈ వూరు పుట్టినప్పటినించీ నే నిక్కడే వున్నా దొరా"అంటాడు. వాళ్ళ ఇంట్లో వీళ్ళ ఇంట్లో రెక్కల కష్టం చెయ్యటం .... వాళ్ళు పెట్టినది తిని దేవాలయం మండపంమీద ముడిచి పెట్టుకుని పడుకోవటం అతని నిత్యకృత్యం. చెలపాయ్ .... నమ్మినబంటు ఓ గజ్జికుక్క. అది మొదట్లో బాగానే వున్నా దరిమిలా గజ్జిపట్టి మహా బాధపడుతుంటే దానికి సపర్యలు చేస్తూ అన్నం నీళ్ళు మరిచి ... మందులు రాచి చెరువులో దాన్ని బలవంతంగా స్నానం చేయించి మహా అవస్థపడుతూ వుంటాడు. ఆ వూళ్ళో యే ఇంట్లోవాళ్ళకి కష్టం వచ్చినా ముందు కన్పించేది చెలపాయ్. అందరికీ తల్లోనాలుకలాంటి వాడు.

అతనికి కాస్త తిక్క కుదిరినప్పుడల్లా "బండీపంతులు గారూ .. నాకూ ఓ అచ్చరం ... చెప్పండీ" అంటూ ఓ విరిగిన పలకపెంకూ, చిన్న బలపం ముక్క చెవులో దూర్చి బడికి వెడుతున్న కుర్రవాడిలా ముఖం పెట్టి, గర్వంగా తనవైపు అందరూ చూస్తూన్నారా లేదా? అని ప్రతి వాకిలివైపూ చూస్తూ నడుస్తాడు.

"నీకెందుకురా. చదువు ?" అని ఎవరన్నా అంటే చాలు ... రహశ్యంగా వాళ్ళచెవులో చెప్తాడు. బాబాయ్ ఎవర్నీ నమ్మగూడదు ప్రతిసారీ 'దేవుడికి వుత్తరం రాస్తాంరా చెలపాయ్ .... ఓ రెండు రూపాయలియ్యి.' అని... నాదగ్గర డబ్బు కాజేసి .... దొంగ యెదవలు. ఎన్నినాళ్ళైనా ... జబాబు రాదంటారే. ఎందుకేం 'ఎందుకురాలా.' అని నే దబా

యిత్తే .... నవ్వుతారంతే ... ఆళ్ళట్టా ...నవ్వితే .. చావగొట్టబుద్దేసద్ది.... ఆ... దర్జీఆడిని, మొన్నోసారి చావబాదినాగందా. నా కాడ ఎంత డబ్బు.... కాజేసాడో దొంగనాకొడుకు! అందుకే గందా ... బండీపంతులు కాడికెళ్ళి ... నేనే.... సదివేస్తా .... నేనే.... దేవుడికి....వుత్తరం రాసేత్తా .... నా కొచ్చిన వుత్తరం ముక్క నేనే సదివేస్తా యెట్టాగుంది బాబాయ్. నా పేలనా. (ప్లాను) అంటాడు తన తెలిపికి తనే మురిసిపోతూ "ఇదిగో పంతులుగారు నే సదివి, నేనే వుత్తరం రాస్తానా" .. ఆ పోట్టు మడిసి నాకుత్తరం యివ్వకుంటే సూస్తా. సూస్తా. నా సామి రంగా ... ఆడిని పట్టుకుని సున్నంలోకి ఎమిక లేకుండా సావగొడతా, ఎవడడ్డొత్తాడో యీ చెలపాయ్‌కి నే చూస్తా ... మీసం మెలేస్తున్న చెలపాయ్ ముఖంలో అంతలో కోపం అంతలో హేళనా. అంతలోనే రకరకాలుగా మారి చివరికి ఎప్పటి అమాయకత స్థిరంగా నిలుస్తుంటే ....చూస్తూ ఆలోచిస్తున్నారు మాష్టారు.

చెలపాయ్ అంతకుముందు చాలా సార్లు "చదువు చెప్పండి" అని వచ్చినా మాష్టారు ఆ మాట అంత శ్రద్ధగా వినేవాడు కాదు. అప్పటి ఆ మనస్తత్వం ఇలా ఆలోచించేందుకు అవకాశం ఇచ్చేదికాదు ... మాష్టారి మనస్సులో గట్టిగా నిర్ణయించేసుకున్నారు ఎలాగైనాసరే ఎంత కష్టపడైనా సరే.... చెలపాయ్‌కి చదువుచెప్పాలి. ఆ అమాయకుడి మనస్సులో యిన్ని ఆలోచనలు వున్న సంగతి ఇప్పుడు గ్రహించారు ఆయన. ఈ ప్రయత్నంలో ఫలితం ఎంతవరకువున్నా ప్రయత్నలోపం మాత్రం చెయ్యను. మనస్సులోనే అనుకున్నారు మాస్టారు. అంతరాత్మ నవ్వింది. నువ్వూ ఆ పిచ్చి

వాడితో సమాన మవుతున్నారా? అని. కాదు... కాదు, ఆ పిచ్చి మనస్సుని అర్థం చేసుకున్నాను.. కాదు. అందుకు ప్రయత్నిస్తున్నాను ... అనుకున్నారు "చెలపాయ్, నీకు తప్పకుండా చదువుచెప్తా. రోజూ రాత్రి మా ఇంటికిరా" అన్నారు ఎంతో ఆప్యాయంగా. ఎగిరి గంతేశాడు చెలపాయ్.

"బాబ్బాబు రాతిరి నాకు ఈలుగాదంటే. నా కన్నా సీకట్లో బయపడ్డది బాబ్బాబు పొద్దునప్పుడొత్తా. సూరుడు అటు పొడవరిగానే నే మీ ఇంటి ముందువాల్తా. సరేనా పంతులుగారూ."

"కన్నా .... అదెవరు?" కొశ్చెన్ మార్కు ముఖం పెట్టారు మాష్టారు.

"అదే, బాబూ. నా..." సిగ్గుగా ముఖం పెట్టి నీళ్ళు నమిలాడు చెలపాయ్.

అప్పటికీ శతకోటి అనుమానాలు తలెవెత్తాయి మాష్టారి గుండెల్లో. ఇంతలో ఓ కుర్రాడు రోజుకుంటూ పరిగెత్తు కొచ్చి "చెలపాయ్. నీ కన్నా ... మంచి .... బండి పోయింది. అమ్మో రక్తం." అంటూ నచ్చినంత వేగంగానూ పరుగెత్తి వెళ్ళిపోయాడు. "ఆ ... కన్నా .... నాకన్నా" అంటూ సుడిగాలి లాగా పిచ్చిబలం అంతా కూడగట్టుకుని పరుగెత్తాడు చెలపాయ్.

ఇదంతా యేమిటో అర్థంకాని ... మాష్టారు ఆలోచిస్తూ ఇంటి ముఖం పెట్టారు.

తెల్లవారింది.

"రామం రఘునాదస్య శతకోటి ప్రవిస్తరం ...." అంటూ జానకమ్మ అప్పటికే చెరువులో స్నానంచేసి వచ్చి పెరట్లోని ముద్దమందారాలూ, నందివర్ధనాలతో కోదండ రాముడిని పూజిస్తూ స్తుతిస్తున్న ఆమె మృదుమధురమైన కంఠం వీనులవిందుగా వినిపిస్తూంటే, సరిగ్గా ఆ సమయానికే వేణుగోపాలస్వామి కోవెల్లో ధనుర్మాసం పూజ పూర్తిచేసి ఆచార్యులుగారు వాయించే 'జేగంట' టంగ్ టంగ్ అనే ధ్వనిలో జానకమ్మగారి భక్తి గీతాల శబ్దంలో కలిసిపోతూంటేనే వెంకట్రామయ్య మాష్టారికి తెల్లవారినట్లు గుర్తు. ఆ ప్రభాత సమయాన ఆయన గుండెల్లో యేదో మధురమైన భావతరంగాలు వుప్పొత్తున లేచిపడుతూ వుంటాయి. తన యెదురుగా కోదండరాముడు సాక్షాత్కరించినట్లు అనుభూతి చెందుతూ వుంటాడు ఆయన. ఈ మధ్యన ఈలాంటి అనుభూతి మరీ యెక్కువైంది ఆయనకు.

ఆయన లేస్తూనే అనుకున్నాడు ... ఈరోజే చెల వాయికి .... అక్షరాభ్యాసం చెయ్యాలి, అని.

స్నానం పూర్తిచేసుకుని పసుపు రాసిన పలకా, పెద్ద బలపం కోపీ దగ్గర పెట్టుకుని యెదురు చూస్తుంటే హిడింబాయమ్మకి వళ్ళు మండిపోతోంది భర్త ప్రవర్తనకి.

"అసలు ఆ పిచ్చి వెధవకి చదువు వస్తుందనేనా మీ వుద్దేశ్యం? అవ్వః యెవరన్నా వింటే నుమ్మల్ని ఓపిచ్చి మని షినిచేసి నవ్వగలరు" అంటూనే అరటిపూచ చక్రాలు చక్రాలుగా తరిగి మజ్జిగ తేటలో వేస్తూనే భర్తని సాధిస్తోంది.

మాష్టారు మవునంగా వీధివాకిట్లోంచి ఇంట్లోకి

ఇంట్లోంచి వాకిట్లోకి కాలు కాలిన పిల్లిలాగే తిరుగుతున్నారు. చెలపాయ్ జాడలేదు. అశాంతిగానే ఆయన భోజనం కూడా సరీగ్గా చెయ్యకుండా స్కూలుకు వెళ్ళిపోయారు. క్లాసులో కూడా పిల్లలకి పాఠం సరిగ్గా చెప్పలేకపోతున్నా రెందుకో?

సెకండ్ ఫారం చదివే శేషూ, ఆచారీ ఆలస్యంగా వచ్చి మాష్టా రేమంటారో అనే భయంతో నిలబడిపోయారు.

"ఎందుకింత ఆలశ్యమైంది" గద్దించి అడిగారు ఆయన. వణుకుతూన్న ఆ పిల్ల లిద్దరి నోట్లోంచీ ఒక్క అక్షరం బయటికి రాలేదు. ఇంతలో క్లాసులో సిసింద్రీ లేచి అటు (ఆ పిల్లాడి బిరుదు) సార్... చెలపాయ్- కన్నా చచ్చిపోతుందిగా— అందుకనీ చెలపాయ్ యేడుస్తుంటే వీళ్ళంతా.... చూస్తూ అక్కడే నుంచున్నారండీ. పాపం ..ఆ కన్నాకి పసుపూ...పువ్వులూ— అన్నీ తెచ్చి... ఏమిటేమిటో చేశాడంటె పాపం- చెలపాయ్ బలే యేడుస్తున్నాడు- క్లాసు పిల్లల కళ్ళనిండా నీళ్ళు తిరిగినాయి. అందరూ చొక్కా అంచులతో తుడుచుకుంటుంటే మాష్టారు గతుక్కుమన్నాడు. "నిన్న కూడా.... చలపాయ్ ఈ కన్నా పేరు వినేకదూ పరిగెత్తిందీ! అసలు ఈకన్నా ఎవరు?" సిసింద్రినే అడిగారు ఆయన.

అప్పటివరకూ విషాదంగా వున్న ఆ పిల్లల ముఖాలు ఒక్కసారి ఫక్కుమన్నాయి "పిచ్చి మాష్టారు లాగుందే. కన్నా చెలపాయ్ కేమిటవుతుందంటా రేమిటీ"అనుకుని"కన్నా అంటే.... అంటె గజ్జికుక్క "యెలాగో చెప్పేశాడు సిసింద్రీ"

ఒక గజ్జికుక్కకోసం పిచ్చిచెలపాయ్ హృదయవిదారకంగా విలపిస్తున్నాడు. మానవుడు చంద్రుడిమీద కాలు

మోపాడు. మనిషిలేని వుపగ్రహం శుక్రుడివైపు చూసుకు పోవటానికి ఆయత్తం అవుతోంది. తను ఈ పిల్లల బుర్ర లోకి "జామెంట్రీ" యెక్కించలేక కుస్తీపడుతున్నాడు.

ఇంటి దగ్గర హిడింబాయమ్మా, జానకమ్మా సర్వం మరిచి వైకుంఠపాళీ ఆడుతున్నారు- ఆదినారాయణగారు తన అడుగుల చప్పుడు భార్యవినకుండా చెప్పులు చేత్తోపట్టుకుని వీధివాకిలి మెల్లగా దగ్గరకిలాగి చతుర్ముఖ పారాయణకి యెదురు చూస్తున్న స్నేహబృందంవైపు సాగిపోతున్నారు.

పొద్దు వాలిపోతోంది. చెలపాయ్‌ని వెతుక్కుంటూ మాస్టారు వూరంతా తిరిగి తిరిగి అలసిపోయారు. కన్పించిన ప్రతి చెట్టునీ పుట్టనీ అడిగారు.

"మా చెలపాయ్‌ని... చూశారా? చూస్తే కాస్త చెప్పరూ?" అంటూ ఆయన మనస్సు మూగగా రోదించింది. చెమటతో చొక్కా తడిసిపోయింది. ముఖానికిపట్టిన చెమటని వుత్తరీయంతో మాటిమాటికీ తుడుచుకుంటూ చుట్టూ వెదకుతూనే వున్నారు. మామిడితోపు దాటి శ్మశానంలో అడుగు పెట్టగానే దూరంగా యేడిచి...యేడిచి అలిసి సొమ్మసిల్లి పడిపోయిన చెలపాయ్ కన్పించగానే ఆయనకి ప్రాణం లేచి వచ్చింది.

"చెలపాయ్" కుదుపుతూ లేవనెత్తారు. విడవడని కను రెప్పలు బలంగా యెత్తి.... ఆయన్ని గుర్తించి మళ్ళీ .... బోరుమన్నాడు.

"బడిపంతులుగారూ... నా కన్నా ... నన్న వదిలేసి పోయిందండీ" అంటూ పంతులుగారూ .... ఒక్కసారైనా

చూడని ఆ "కన్నా" కోసం రెండు కన్నీటిచుక్కలు రాల్చారు అమాయకుడైన చెలపాయ్ మనస్సులో అంత చోటు చేసుకున్న "కన్నా" నిజంగా ధన్యజీవి.

మనిషికీ మనిషికి మధ్యన యెంతో విద్వేషం .... అసూయా పెరిగి నాగరికత వెర్రితలలువేసే ఈ ఇరవైయవ శతాబ్దపు ఆఖరులో ఒక అమాయకుడు నోరులేని గజ్జికుక్క కోసం ఇలా విలపించటం ... ఆశ్చర్యమైన విషయంకదూ? విజ్ఞానం పెంపొందినా .... సంస్కారాన్ని పెంచుకోలేని .... సంకుచితులైన ఈ తరం జనబాహుళ్యానికన్నా వికసించని ... ఈలాంటి ప్రకృతిలోనే ప్రశాంతత వుందేమో? అన్పించింది మాస్టారికి.

చెలపాయ్ శరీరానికి అంటుకున్న దుమ్ముని.... యెంతో ఆప్యాయంగా దులిపి అతన్ని నెమ్మదిగా లేవనెత్తి .... "చెలపాయ్ .... నువ్వు చదువుకోవూ? నీ కోసం .... పలకా బలపం తెచ్చి .... పొద్దుననించీ ఎదురు చూశాను రా .... రా.. ఇంటికి వెడదాం .." అన్నారు.

"ఇంకా నాకు —సదువెందుకూ పంతులుగారూ...." కుమిలి కుమిలి యేడుస్తూనే వున్నాడు చెలపాయ్. "నాకన్నా" నా ప్రాణంలో ప్రాణం ... నన్నొదిలి పోయింది పంతులు గారూ అంటూ వుదయంనించీ యేడ్చి యేడ్చి ముఖం కళ్ళూ పీక్కుపోయి వున్నాయి. పచ్చి మంచినీళ్ళయినా ముట్టక పోవడం వల్ల గొంతు తడారిపోతోంది. .... మాటకూడా సరిగ్గా రావటంలేదు. యేదైనా చెలపాయ్‌తో అవుసరం వస్తే

తప్ప ఆ వూరి ప్రజలకి చెలపాయ్ .. యేమైనాడు? ఉన్నాడా లేడా అనే ఆలోచనే రాదు యెవ్వరికి.

నెమ్మదిగా చెయ్యిపట్టుకుని లేవనెత్తి ... ప్రేమగా పొదివి పట్టుకుని .... మెల్లగా నడిపించుకువస్తున్న మాష్టార్ని అల్లంత దూరాన్నించే చూసింది హిడింబాయమ్మ పెరట్లో పడి ఇవతల హిడింబాయమ్మా, అవతల జానకమ్మానుంచుని కబుర్లలో పడ్డారంటే .... చివరికి .... ఇంట్లో దొంగలపడి దోచుకు పోయినా ఆ ఇద్దరూ గమనించరు. వాళ్ళు చెప్పుకునే కబుర్లు అలాంటివి.

హిడింబాయమ్మ అంటోంది. "చూడక్కయ్యా ... దేవుడిదయవల్ల పెద్ద విపత్తు దాటి బయటపడ్డారని సంతోషంలేకుండా వుందంటేనమ్ము! అసలు మనిషే మారిపోయారు యేమిటో నాకంతా అయోమయంగా వుంది ... వచ్చిన జీతం డబ్బులన్ని సరిగ్గా ఇంటికి తెస్తే యెలాగో అలా సంసారం నడపొచ్చు దానాలూ .... ధర్మాలూ ... బీదపిల్లలకి పుస్తకాలంటూ ... మనకి లేకుండానే దానంచేసి వస్తుంటె ఆ కోయ వెధవ నా ప్రాణానికి యెముడల్లే దాపరించి సంసారాన్ని తారుమారు చేశాడుగదా! చెంబూ తెప్పాలాకూడా అమ్ముకుని .... సత్తుబొచ్చలతో కాపరం వెలిగిస్తున్నా యేమిటో" కళ్ళు వత్తుకుంది. జానకమ్మ దడి అవతలనించే ఆమెకళ్ళు తన పమిటతో తుడుస్తూ చెల్లాయ్, దుఖఃపడకు. యెలా జరగవలసుంటే అలాగవుతుంది. కర్కోటకుడిలాంటి మరిది. ఇంత దయార్ద్ర హృదయుడిగా మారాడంటే నిజంగా ఆశ్చర్యంగా లేదూ? ఆస్తి పోతే

పోయింది. దేశం నాలుగుమూలలా చూడటంవల్లనో మరెందుకో అతనిలో మార్పు వచ్చిందని అందుకు సంతోషించు. అన్నింటికంటే నీ తాడు గట్టిది. భగవంతుడికి జన్మంతా ఋణపడ్డావు. అయినా అంతా నీ అదృష్టమే అనుకో. డిశంబరు 27 వ తేదీన నేను నిద్రపోతే ఒట్టు అనుకో. అప్పుడప్పుడూ చెలపాయ్ అడుగుతూ వుండేవాడు "అమ్మా బడిపంతులుగారు బాగున్నారా? వుత్తరం ముక్కోస్తోందా అని" చెల్లాయ్ ... నిజంగా చెలపాయ్‌లాంటి విశ్వాసం గల వాడు అరుదు. ఒట్టి అమాయకుడు. పిచ్చి ఆపేక్షా అదీనూ. "అమ్మా— నువ్వే మా అమ్మవి —" అంటాడు.

మీకు తిండికీ బట్టకీ లోటులేదుగదా - అస్తమానం జరిగిందానికి బాధపడకు. మీ బావగారు చూడు ? జీవితం అంతా పోరినా తన అలవాటు ఒక్కటైనా మార్చుకున్నారా ? తట్టలో కాపరం బుట్టలోకి వచ్చింది అన్నట్లు మూడెకరాల్లోకి వచ్చిందిగదా ! పేకాటలో యేరోజు — యెన్ని వందలు తగలేస్తున్నారో ఆ పరమాత్ముడికి కూడా తెలియదు. కట్టుకున్న పెళ్ళాన్ని ఒక్కరోజన్నా ఆప్యాయంగా పల్కరించటం — చేతకాదుగదా ! ఇంక జీవితం అంటే తినటం, గుడ్డ కట్టుకోటం .... పిల్లల్ని పెంచటం ఇంతేగా — ? ఛీ ఛీ ... నిజంగా చెల్లాయ్ - నాకు జీవితం మీద చాలా విసుగ్గా వుంది. సరోజ దగ్గరికి వెళ్ళి ఒక నెల రోజులు వుండి రావాలని వుంది" కళ్ళు వత్తుకుంటూ తన గుండెల్లోని బరువు దించుకుంది జానకమ్మ.

"బావగారు యెక్కడా కన్పించటంలేదేం ? మాట మార్చాలని అడిగింది.

'మూడు రోజులుగా నిద్రాహారాలు మానేసియెన్ని వందలు తగలేశారో? ఇంటికొచ్చి మాట్లాడకుండా నీలుక్కుపడుకున్నారు- నా కడుపుమండి పోయిందంటే నమ్మ ... నే చచ్చింతర్వాత కూడా ఆయన ఈ వ్యసనాన్ని మానరు.... ఈ జూదం ఆడి యెవరు బాగుపడ్డారు ...ఆస్తి కరిగిపోయిందంటే కరిగిపోదూ .... అది ఒప్పుకోరు నీపిల్లల చదువులకీ ఆడపిల్లల పెళ్ళిళ్ళకీ ఆఖరైదంటారు. ఆ ముఖం చూస్తే నాకు అసహ్యం .... నువ్వు యెన్నన్నా చెప్పుచెల్లాయ్ - ఈ ఒక్క విషయం నేను క్షమించలేను. యెంత ప్రయత్నించినా సరిపెట్టుకోలేక నాలో నేను .... యెంత కుమిలిపోతానో ఆ పరాత్పరుడికే తెలుసు. నేనూ మాట్లాడలేదు. అయినా ఇట్లా మాకు పరిపాటేగా - నిన్న పొద్దునే లేచి - స్నానం చేసి - పూజకి కూర్చోబోతే - చెప్పద్దూ - నా రక్తం వుడికెత్తిపోయింది- చేసేవి మాఘుస్నానాలూ దూరేవి ... అన్నట్లు యెందుకీ పూజలు? ఇంట్లోనుండి .... ఆ పూజ విగ్రహాలూ ఫొటోలూ తీసుకెళ్ళి .... నూతిలో పారేశాను. చేసిన పాపం చెప్తే పోతుందన్నట్లునే చేసింది తప్పే కావచ్చు ఇన్ని యేళ్ళు పై బడ్డా జీవితంలో ఒకక్రమపద్ధతిని అలవరచుకోలేని వ్యసనాలని కాస్తయినా అదుపులో పెట్టుకోలేని ఈ మనిషికి భగవంతుడిని పూజించే హక్కు లేదంటాను. గంటల తరబడి పూజామందిరంలో కూర్చుని ముక్కుమూసుకుని గాయిత్రీ చెయ్యగానే సరా?

పిల్లలు పెద్దవాళ్ళై ... ఈ చెడ్డ అలవాట్లు వాళ్ళకి పట్టుపడకుండా వుండాలని యెన్ని దేవుళ్ళకో మొక్కుకునే దాన్ని. నా కోపాన్ని బయటికి కక్కితే తండ్రిని ఆ పిల్లలు నిర్లక్ష్యంగా చూస్తారేమో అని ఇలా ... ఎన్నో ఆలోచనలతో ఎంతో జాగ్రత్తగా జీవితం సాగించానో అబ్బ .... జీవితంలో దరిద్రాన్ని హాయిగా భరించవచ్చు కాని, దాంపత్యంలో ఇలా ... ఘర్షణ భరించటం ఎంతనరకమో అనుభవించే వాళ్ళకే తెలుస్తుంది.

"అక్కా ... యేది యేమైనా నువ్వు బాధపడకు. నీ బాధ నాకు తెలుసు కాని బావగారిమీద కోపం భగవంతుడి మీద చూపించటం" మరేం చెప్పలేకపోయింది హిడింబాయమ్మ. జానకమ్మ కళ్ళనించి సంతతధారగా ప్రవహిస్తున్న కన్నీళ్ళని తన చేత్తో తుడుస్తూ — "వూరుకో అక్కా ఎన్నో విషయాల్లో నన్ను మందలించి సరైన దారిలో పెట్టే నువ్వే ఇలా చేశావంటే నీ మనస్సు ఎంత గాయపడిందో తెలుస్తూనే వుంది. యేమిటో కొంతమంది మనసులో ఎదటి వాళ్ళు ఎంత బాధపడుతున్నా అర్థం చేసుకోలేరు ... అయినా బావగారు మరి ఆ బలహీనతను ఎందుకు అదుపులో పెట్టుకోలేకుండా వున్నారో మరి. పోనీ కొన్నిరోజులు సరోజ దగ్గర వుండిరా - మనస్సుకి కాస్త హాయిగా వుంటుంది. బావగారికి నువ్వు దూరంగా వుంటే కష్టం కాస్త తెలిసన్నా వస్తుంది.

ఇంకెక్కడి బావగారు "ఇంక నే బ్రతికుండగా నీ ముఖంచూడను" అని కొడుకు దగ్గరకి లేచిపోయారు. వెక్కి వెక్కి ఏడిచింది జానకమ్మ.

"ఆ అంతపనిచేశారా? ఒక మాట అనుకున్నా చివరికి భార్యాభర్తలు ఒకటి కావాలి గాని కొడుకులూ కూతుళ్లూ అవుతారా ఏమిటో పిచ్చి" నిట్టూర్చింది హిడింబాయమ్మ.

"చెల్లీ నే రేపే వెడుతున్నా, పాడి పసువుల్ని పాలేరు కప్పచెప్పా. ఇల్లు కాస్త జాగ్రత్తగా చూసుకో. నేను ఒక్క-దాన్ని ఆయన లేకుండా వుండలేనే చెల్లీ వుండలేను.

అంత విచారంలోనూ హిడింబాయమ్మకి నవ్వు వచ్చింది. పట్టుదలతో వుంటారేగాని మళ్ళీ ఒకర్ని ఒకరు విడిచివుండలేరు భార్యాభర్తలు. సరే "అక్కా- ఆయన వస్తున్నారు, నువ్వు త్వరగా వచ్చేయ్. బావగారికోపం, 'తాటాకుల మంట' లాంటిది. నాలుగు రోజుల్లో తగ్గిపోతుందిలే, తిరిగి ఇంటికి ఇద్దరూ కలిసిరండీ అంటూ లోపలికి వెళ్ళిపోయింది భారంగా.

ఆదినారాయణగారు పెద్ద కొడుకు దగ్గర యెంతో కష్టంగా 'నెల' గడిపి, చిన్న కొడుకు ఇంట్లో పది రోజులే వుండి, మూడో కొడుకు దగ్గరకి వచ్చేశారు. వాసు ఎంతో సంతోషపడ్డాడు తండ్రి రాకకి. "అమ్మని కూడా తీసుకు వచ్చివుంటే బాగుండేది కదూ నాన్నా. సరోజకి వుత్తరం రాస్తాను - అమ్మని నాదగ్గరికి పంపమని" అన్నాడు తండ్రితో పాటు భోజనం చేస్తూ. కోడలు కొసిరి కొసిరి వడ్డిస్తున్న కొబ్బరి పెరుగు పచ్చడితో సుష్టిగా భోజనం చేస్తూ ... "వుండని కూతురు మోజు తీరని" అన్నారు.

ఇలా ఆరు నెలలు జరిగినా, భార్యాభర్తలు పట్టుదలలు సడలలేదు.

సరోజ భర్త భాస్కరం అంటూండేవాడు, "సరూ అంత పెద్దవాళ్ళకి కూడా ఏమిటే పంతాలు" అని "మీకు బరువైతే చెప్పండి" రెచ్చిపోతూ అనేది. "ముక్కుమీద కోపం ముఖానికే అందం" రాగం తీసేవాడు భాస్కరం. "ఆ తర్వాత" అనేది నవ్వుతూ తేలిగ్గా. ఆ తర్వాత ఏమిటో భాస్కరానికి వస్తే కదా పాడేందుకు!

"ఈ రోజు ఆఫీసునుంచి వచ్చేసరికి రాణీగారు రెడీగా వుంటే పిక్చర్ కి చెక్కేద్దాం స్కూటరెక్కుతూ అన్నాడు. వద్దులేద్దూ-ఈరోజు అమ్మ ఓ లాగావుంది. మీరు వెళ్ళండి- నసిగింది సరోజ.

ఇదిగో ఇలాచేస్తే "జై భజరంగ హరా" - అంటాను. ఆఫీసుకి వెళ్ళిపోయాడు భాస్కరం.

జానకమ్మకి బొత్తిగా తోచటం లేదు. అల్లుడూ కూతురూ ఎంతో అభిమానంగా చూసినా - ఏమిటో ఆవిడ మనస్సులోనే ఏదో చెప్పలేని వెలితి. మాటి మాటికి ఆదినారాయణగారే గుర్తువస్తున్నారు ఆవిడకి. కాస్త భోజన ప్రియుడు- కొసిరి కొసిరి వడ్డిస్తేగాని తృప్తిగా భోజనం చెయ్యడు. ఎవరి ఇంటికన్నా విందుకి వెళ్ళినా అర్థాకలితోనే వచ్చేసి "ఇదిగో జానీ గమ్మున పోపు వేసి కాస్త 'వుప్మా' వేసేయ్ ఇంతలో ఓ కునుకు తీసిలేస్తా" అంటూ గుర్రుపెట్టే వారు. క్షణంలో ఆయన వింత ప్రకృతికి ఆవిడకి మొట్ట మొదట ఆశ్చర్యం వేసినా తర్వాత అలవాటయి పోయింది.

ఆయన అర్థాకలి తెలిసి ఎలా బద్దకిస్తుంది? విసుగ్గానే లేచిపొయ్యి వెలిగించి ఆయన నిద్రలేచేసరికి కమ్మగా వాసన

వేస్తున్న 'వుప్మా' కంచంలాంటి ప్లేటులో సర్దిపెట్టి మంచి నీళ్ళు ముందువుంచి అనేది "ఎన్నేళ్ళు వచ్చినా ఇంతేనా? భోజనం దగ్గర సిగ్గయినప్పుడు ఆ భోజనానికి వెళ్ళటం ఎందుకు వచ్చి ఇలా నా ప్రాణం తియ్యటం ఎందుకు? అనేది "అదేమున్న మాట, వాళ్ళు రేపు మనింటికి రావద్దూ? ఏదీ చాలా బాగుంది ఇంకా వుందా అయిపోయిందా" అన కుండా గిన్నె మూత తీసిచూసేవారు. తనకి వళ్ళు మండి పోయేది. ఈలాంటి వెధవ అలవాట్లే తనని గాయపరుస్తాయి "మొగాడు మహారాజులాగా బ్రతకాలి కావాలంటే తనకి వెనక్కు లేకుండా అంతా పెట్టి సంతృప్తి చెందుతుంది. కాని ఇలాంటి ఆడబుద్ధులు అనేద కోపంగా ఇంకేంవుంది! చెట్టంత మొగాడుని పట్టుకుని "ఆడ బుద్ధులు" అంటే కొంపమున గదూ? పర్యవసానం తినేప్లేటు విసరికొట్టిలేచ్చకాక్కా పోయేవారు ఆయన. ఇంక ఒక వారం రోజుల వరకూ ఇద్దరికీ మాటలుండవు. తను ఎంత సౌమ్యంగా జవాబిద్దామని అను కున్నా ఆయనలోని తనకిష్టంకాని అలవాట్లని భరించలేక పోయేది. ఆయన్ని మార్చటం తనవల్ల కాలేదు, పోనీ భరించే శక్తి తనకిలేదు. పర్యవసానం ఘర్షణమాత్రమే.

ఈ ఘర్షణలో తమ పిల్లల సమస్యలని ఇరికించకుండా అన్నింటికీ తనే రాజీపడి ఒకవింధంగా ఆయనలోని అలవాట్లని వృద్ధిచేశానేమో? అనే అనుమానం ఒక్కక్షణం పీడించినా ఆఖరికి తనకి తనే సంతృప్తిపడేది. "కాదుకాదు నేను చేసిందే సరైంది. లేకుంటే... సంసారం ఓ క్రమంలో నడిచేదా? నా జీవితంలో నెంత అసంతృప్తి వున్నా నా పిల్లల భవిష్యత్తు

కాగుండాలి" ఇలా ఆలోచించే జీవితంలో మూడు వంతులు "రాజీ" పడింది జానకమ్మ. పిల్లలంతా పెద్దవాళ్ళయి ఎవరి గమ్యం వైపు వాళ్ళు ముందుకు సాగింతర్వాత తిరిగి... తమ రిద్దరూ ఒంటరి వాళ్ళయి పోయారు. ఇలాంటప్పుడు భర్తనుంచి యే కాస్త ఆప్యాయత లభించినా జానకమ్మ మనస్థితి ఇలా మారి వుండేదిగాదు. అదినారాయణగారికి ఇవన్నీ ఆలోచించే అలవాటూ లేదు. ఆయనకి అర్థమూ కాదు. తనని యేదో 'తేలిక' పరిచి ప్రతిదానికి కించపరుస్తోంది గనుక దూరంగా వుంచితే తలతిరిగి వస్తుంది. అలా వచ్చినప్పుడే చూద్దాం అనుకుంటాడు ఆయన.

ఆఖరి కొడుకూ, కోడలూ ఆరోగ్యంగా వుంటున్నందుకు ఆయన చాలా సంతోషించారు- అంతకు ముందు క్లబ్బుకి వెళ్ళటం అక్కడ డబ్బు పెట్టి పేకాడటం అలవాటు పడ్డాడు వాసు- విమల యెంతచెప్పినా వినక "సొసైటీ తప్పదు" అనేవాడు- లోపల లోపలే కుమిలిపోయేది విమల- అర్ధరాత్రి వరకూ భర్తరాకకోసం యెదురు చూస్తూ అలాగే కూర్చునేది ... పగలంతా ఆఫీసువర్కు- రాత్రి... సరైన టైముకి నిద్రలేకపోవటంతో వాసు ఆరోగ్యం దెబ్బతిన్నది... విమల కన్నీళ్ళకి అంతులేదు. శలవుల్లో ఇంట్లోనే వున్న కొన్ని రోజుల్లోనే భార్య పడుతున్న దిగులు.... స్త్రీ.... తన సర్వస్వంగా యెంచే భర్తఆరోగ్యం.... అలవాట్లు అన్నింటి కోసం.... యెంత తపించిపోతుందో అర్థంచేసుకున్నాడు వాసు అలవాట్లని కాస్తమార్చుకున్నాడు. క్లబ్బుకి వెళ్ళినా రెండు గేములు టెన్నిస్ఆడి.... ఆ తర్వాత పేపర్ చూసి...

స్నేహితులతో సరదాగా కాస్సేపు కబుర్లుచెప్పి ఇంకా టైము వుంటే టేబుల్ టెన్నిస్ కాస్సేపు ఆడి... 9 గం|| ఇల్లు చేరుకునేవాడు. అలా వచ్చేసినప్పుడు... విమల కళ్ళల్లో కన్పడే సంతృప్తి అతనికి యెంతో హాయి యిచ్చేది. భోజనం చేసి విమలచెప్పేవి కబుర్లువింటూనే కాస్సేపు అర్జంట్ "ఫైల్సు" చూసుకుని హాయిగా నిద్రపోయేవాడు... మెదడు వేడిక్కి నిద్రరాకపోవటం అంటూ వుండేదిగాదు. తనని మనస్ఫూర్తిగా ప్రేమిస్తూ భర్తే సర్వస్వం అనుకునే తన అర్ధాంగి మనస్సుకి బాధ కలగకుండా చూసుకోవటం తన ధర్మం... అనుకునే వాడు వాసు.

కొడుకునిచూస్తే ఈ ఒక్కవిషయానికి మాత్రం ఆదినారాయణగారికి చాలా చికాకుగా వుండేది. వెధవ...I.A.S. పాసై నాడు వెయ్యి రూపాయలు జీతం తెస్తున్నాడు... కాని... వ్యక్తిత్వంలేదు అనుకునేవాడు. ఓరోజు విమల కళ్ళు తిరిగి పడి పోయింది- తలకికాస్త బలంగానే దెబ్బ తగిలింది- వాసు గిల గిల్లాడిపోయాడు. ఒక్కక్షణం విడవకుండా దగ్గరేవుండిపోయి అర్జెంటుగా రమ్మని డాక్టర్‌కి ఫోన్‌చెయ్యటం- ఆయన ఆఘమేఘాలమీదవచ్చి, విమలని పరీక్షించి. మందుఇచ్చి, వాకిట్లోకి వచ్చి చిరునవ్వుతో "మిస్టర్ వాసూ" మీరు తండ్రి కాబోతున్నారు- అంటూ చిరునవ్వుతో మెట్లు దిగాడు- వాసు ముఖం ఆనందంతో వెలిగి పోతోంటే తల యెత్తకుండానే గమనిస్తున్నారు ఆదినారాయణగారు-

ఇంక ఆరోజు వాసు క్లబ్బుకి కూడా వెళ్ళలేదు. మిత్రుడు శ్రీనాథ్ పరామర్శించటానికి వచ్చాడు భార్యతో సహా-

సరళా, విమలా లోపల కూర్చుంటే శ్రీనాథ్, వాసూ తోటలో కూర్చున్నారు.

వరండాలో వాలుకుర్చీలో పడుకుని పేపర్ లో తల దూర్చినా ఆదినారాయణగారికి ఆ సంభాషణే విన్పిస్తోంది-

"భార్యా భర్తలు- వారి మధ్యన వుండే సున్నితమైన బంధాలూ, వాటిని ఆ జన్మాంతం యెంత జాగ్రత్తగా, కాపాడుకోవాలో విమర్శించుకుంటు న్నారు.

"ఒకరిని ఒకరు అర్థం చేసుకుని ఒకరి సంతృప్తికోసం ఇంకొకరు చిన్న చిన్న అలవాట్లని మార్చుకుంటూపోతే దాంపత్య జీవితం నిత్యనూతనంగా యెందుకు వుండదు?" ప్రశ్నిస్తున్నాడు శ్రీనాథ్. వాసు తన విమల అనారోగ్యం యెంత బాధ కల్గించిందో యేకరువు పెడుతున్నాడు. ఆది నారాయణగారి మనస్సులో యేవో నూతన భావాల కవాటాలు తెరుచుకున్నాయి.

జానక్కి జ్వరంవచ్చి యెన్ని రోజులైనా "యెలావుంది?" అని అడిగిగాని దగ్గర ఒక్క క్షణం కూర్చుని కానీ యెరుగడు. ఒకసారి జానకమ్మ జ్వరంతో పన్నెండు రోజులుగా మంచంలో పడివుండి పనివేళా పిలిచి మరీ కయ్యానికి దిగింది. "నేను చచ్చిం తర్వాతనైనా నా విలువ తెలుస్తుందా మీకు?" అని. "ఈ కాస్త జ్వరానికే చచ్చిపోతావా? అయినా డాక్టరు మందిస్తుంటే పిల్లలందరూ వుండనే వుండె, నీకు వచ్చినలోటు యేమిటి?"

జానకమ్మ ఆవేశంగా రెచ్చిపోయింది.

"ఇదిగో ఒక్కసారి యెలా వుందనైనా అడిగారా?

పిల్లలున్నా రంటారేం. ఈ పిల్లలకి నేను కావాలి. కాని నాకు మీరు కావాలి...మీరు కావాలి ఈ సంగతి కాస్తయినాగ్రహించారా. పొలం పని లేకుంటే పేకాటా ఇవి తప్ప మరో లోకం మీకక్కర్లా. కాని..కాని నాకు నాకు ఇదిగో చెప్తున్నా ఈ పిల్లలందరి మనస్సులు కూడా గాయపడుతున్నాయి. నే చచ్చిన మరురోజు మిమ్మల్ని ఒక్కళ్ళు చూడరు. మీ ప్రవర్తన ఇలాగేవుంటే" అంటూ మాటరాక గొంతు మొండిపోయి వెక్కి వెక్కి యేడిచింది.

ఇలా ఒక్కొక్క సంఘటనే ఆయనకి గుర్తు వస్తుంటే, చెప్పలేని బాధ అనుభవిస్తున్నాడు ఆయన. జానక్కి యేం కావాలో తనకి తెలియదు. ఓర్పుగా వుండీ వుండీ ఒక్కసారి 'భగ్గు' మనేది...ఛీ...ఛీ ఇకనైనా జానకి మనస్సుని కష్టపెట్టకూడదు. అసలు ఇన్నిరోజులు ఒక్కతీ యెలా వుందో యేమైనాసరే ఇద్దరం ఒక్కచోటే వుండాలి. ఇంటికి వెళ్ళిపోవాలి. కబురుచేసి జానకిని పిలిపించాలి. ఇల్లూ పొలం దొడ్లో చెట్లూ యెలా వున్నాయో? ఇంక ఆదినారాయణగారికి అక్కడ ఒక్కక్షణం వుండబుద్ధి కాలేదు. కొడుకు వాదిస్తున్నా వినక రైలెక్కేశాడు.

బస్సుదిగి మూడుమైళ్ళు నడిచి పట్టిన చెమటని వుత్తరీయంతో తుడుచుకుంటూ 'వుస్స' అంటూ వాకిలి గుమ్మం యెక్కబోతున్న ఆదినారాయణగారికి వాకిట్లో జానకమ్మ ప్రతి వుదయం పెట్టే చుక్కల ముగ్గు 'సుస్వాగతం' అన్నట్లయింది. తలుపులు తీసేవున్నాయి. తను ముందు వచ్చి జానక్కి స్వాగతం ఇవ్వాలనుకుంటే ఇప్పుడూ తనే వోడిపోయాడు వరండా దాటి హాలులో అడుగు పెట్టాడు.

చెలపాయ్ పెద్దబాలశిక్షలోని పాఠాలు యెంతో శ్రద్ధగా గుణించుకుంటూ వల్లెవేస్తున్నాడు. జానకమ్మ నీరసంగా మంచంమీాద కళ్ళు మూసుకుని పడుకునివుంది.

"కాసీ వేళగాని వేళ ఈ పడక యేమిటి?" అంటూ ఒక్క అంగలో వెళ్ళి తలా వళ్ళూ చేతితో స్పర్శిస్తూ వుంటే జానకమ్మ కళ్ళు పెద్దవిచేసి చూస్తూ వుండిపోయింది భర్త వింత ప్రవర్తనకి.

"జానీ వంట్లో బాగాలేకపోతే నాకో కార్డు రాయిస్తే వచ్చి వాలే వాడినికాదూ? యెప్పుడొచ్చావ్ అస్సలు?" అని ప్రశ్నలు గుప్పిస్తూంటే జానకమ్మ 'కలగంటున్నానా? లేక నిజంగానే జరుగుతోందా? నీ ముఖం ఈ జన్మలో చూడ' నన్న శపథంచేసి నెళ్ళిన భర్త"తనంత తానుగా వచ్చి దగ్గరగా కూర్చుని తను కలలుగన్నట్టుగానే యెంతో ప్రేమగా స్పర్శిస్తూంటే యెనిమిది నెలలుగా గుండెల్లో గూడు కట్టుకున్న దుఃఖం ఒక్కసారి వుప్పెన లాగా పొంగు కొచ్చింది.

చెలపాయ్... ఆదినారాయణగార్ని చూడగానే... గంతులేస్తూ చదివేపుస్తకం దాచేసి 'బాబుగారూ.... అమ్మ బుదారం నాడు ఇంటికొచ్చేశారండీ... దినమూ ఇదేవరస. తిండిల్లే... తిప్పల్లే అట్టా పడుండేదే. బండి పంతులుగారు మీా

ఉత్తరం ముక్క రాశారుగందా.... నే నన్నా "వుత్తరం వొద్దు, నేలగెత్తికెళ్ళి ఆయన్ని లాక్కొస్తా" అని అమ్మ అన్నాదీ "వద్దురా చెలపాయ్, ఆయన రావాలనుకున్నప్పుడే రాని" అన్నారండి. అయినా బాబూ మీకా మాత్రం తెల్వాదూ. కొడుకులు కాడ కులుకుతూంటె అమ్మగతీ, ఈసారి ఇట్ట జేస్తారా. నే చస్తే వూరుకోను. వూ ... అమ్మని చూస్తే నా కడుపులో దేవినట్లుంది. అన్నమే పోవటంలా దొరా. ఇంక మీరెక్కడికీ పోబోకండి. అంటూ అన్ని విషయాలూ యేకరువు పెట్టేస్తూనే బావిదగ్గరికి పరుగుతీసి స్నానానికి నీళ్ళు పెట్టి తువ్వాలు అందించాడు

"బండి పంతులుగారూ .. మా అమ్మగారొచ్చిన్రు. అమ్మగారిని నడ్డించమనండీ" అంటూ ఇక్కడినించే గావు కేకలు వేస్తూంటే "ఏమిటి జాసీ, వీ డిక్కడే వుంటున్నాడా". అన్నాడు ఆయన భార్యవైపు చిరునవ్వుతో చూస్తూ.

ఆయన అలా తనవైపు చూస్తూ మాట్లాడుతుంటె జానకమ్మ మనస్సు సంతోషంతో వురకలు వేసింది. యెంతో బలంకూడా వచ్చింది ఆమెకి. నెమ్మదిగా లేచి కూర్చుని చెప్పింది —

చెలపాయ్ తన "కన్నా" చచ్చి పోయింతర్వాత పిచ్చి వాడిలాగా తిరుగుతోంటె బండి పంతులుగారు మనయిల్లు చూస్తూ ఇక్కడే వుండమని చెప్పారుట. చెలపాయ్ ఇంకెక్క

డకీ కదలటం లా మాష్టారిదగ్గర చదువుకుంటూ. చెల్లాయ్ పెట్టింది తింటూ మనఇల్లూ చెట్లూ పాడవకుండా చూస్తూ ఇక్కడే పడి వున్నాడు. యెనిమిది నెలలనించీ నేను లేకపోయినా అంతా సుభ్రంగా వుంచాడు. ఈయేడు మామిడి విరగ్గాసింది. జామచెట్టు మీదికి చిలకలని వాలనియ్యడంలేదు. అన్నీనగే. వాకిట్లో యెప్పుడో నే వేసిన చుక్కల "ముగ్గు" చెరక్కుండా దానిమీదే రోజూ దిద్దుతున్నాడు. అచ్చంగా నే వేసినట్లు లేదూ? వాడా తెలివితక్కువవాడు? మాష్టరిగారి పుణ్యమా అంటూ సుమతీ శతకంలోని పద్యాలన్నీ కంటతా పట్టాడు. పెద్దబాలశిక్ష ఆ చివరనించి ఈ చివరికి అప్పచెప్పేస్తాడు. కాని రాయటం రాదు. అందుకని పంతులుగారు మన వరండాలో యిసుకపోయించి దానిమీద అక్షరాలు రాసి దిద్దిస్తున్నారు. ఆ యిసుక పొరపాటునైనా తొక్కకండీ. వాడు యేడుస్తాడు.

ఈ కృషి అంతా యెందుకో తెలుసా? ఆగిపోయింది ఆవిడ చెరిగిన తలంతా చేతితో సరిచేసుకుంటూ.

"యెందుకుట?" ఆసక్తిగా అడిగారు ఆయన.

"వాడు తనే స్వయంగా దేవుడికి వుత్తరం రాసేస్తాడుట."

నవ్వుతూ జానకమ్మ కబుర్లన్నీ యేకరువు పెట్టేస్తోంటె ఆదినారాయణగారికి మండు వేసవిలో పన్నీటిజల్లు కురిసి

నట్లుంది. ఇలాంటి అనుభూతి గల గటం ఆయనికి ఇదే ప్రథమం.

యెన్నో జన్మల యెడబాటు తర్వాత కలిస్తే యెలా గన్పిస్తుందో అలాంటి సంతృప్తి జానకమ్మ కళ్ళల్లో కన్పిస్తూంటె-

బండీ మాష్టారూ హిడింబాయమ్మా వచ్చి యోగ క్షేమాలు కనుక్కున్న తర్వాత "స్నానం చెయ్యండి బావ గారూ అక్కకి యీరోజు బాగా ఆకలేస్తూ వుండివుంటుంది" అంది నవ్వుతూ హిడింబాయమ్మ. "అన్నగారూ ఈ రోజు పొద్దుటినుంచీ కాకి కూస్తూంటే మన చెలపాయ్ కాకమ్మా నీ కాళ్ళకి గజ్జలు కడతా గంతులెయ్యి మా దొర వస్తాడని చెప్పవే" అంటూ అడిగి అడిగి కాకమ్మతో గంతు లేయించాడు. నిజంగా వచ్చేశారు. చూడండీ, మీకోసం యెంత మందిమి యెదురు చూస్తున్నామో? కదూ?

అన్నగారూ జీవితంలో కొన్ని కొన్నిటి విలువ మనం ఆలస్యంగా తెలుసుకుంటాం. కాదంటారా? అంటూ భార్యవైపు చూస్తూ నవ్వుతూంటే ఆదినారాయణగారు ఆశ్చర్యంగా ఆ దంపతులవైపే చూస్తూ వుండిపోయారు. "అరే వీళ్లెంత మారిపోయారూ?" అనుకుంటూ.

చెలపాయ్ సోప్ అందించాడు.

"పిల్లలందరూ దూరంగా వెళ్ళిపోయినా నన్ను ఇంకో కొడుకు వెతుక్కుంటూ వచ్చాడు. వీడు వాళ్ళలాగా నన్ను

విడిచి ఎక్కడికీ వెళ్ళడు. వీడు "అమ్మా" అంటూ నన్ను పిలుస్తూంటే మన ఏడుగురు పిల్లలూ కలిసి "అమ్మా" అన్నట్లుంటున్నదంటె నమ్మండి అంటూ జానకమ్మ ముఖం బలహీనంగా వున్నా ఆకళ్ళు యేదో కాంతితో వెలిగి పోతూంటే స్నానంమాట మరిచి చూస్తూ వుండిపోయారు ఆదినారాయణగారు.

చెలపాయ్ మాత్రం తిరిగి పెద్దబాలశిక్షలోని వాక్యాలని పొందికగా రాయటానికి ప్రయత్నిస్తున్నాడు. దొంగనాయాల్లుకి వుండని నే వుత్తరం రాసి దేవుడినించి జవాబు తెప్పించి ఈ వూళ్ళో ప్రతి యెదవకీ వద్దన్నా చదివి నేనే యినిపిస్తా. అట్టా కాకుంటె నాపేరు పిచ్చి చెలపాయ్ కాదు. కాత్త వుండండి. అనుకుంటూ కృతనిశ్చయంతో సాధనచేస్తున్నాడు చెలపాయ్.

కథా నిలయం
5221
శ్రీకాకుళం